# పేకమేడ

"అమ్మాయ్! సర్వీస్ కమీషన్ కండక్టు చేస్తున్నారట అప్లయ్‌చెయ్ గ్రూప్ ఫోర్‌లో ఈసారైనా క్లర్క్ జాబ్ వస్తుందేమో దేవుడు మేలు చేస్తే" అన్నాడు కృష్ణమూర్తి కూతురుతో.

సరస్వతి "అలాగే నాన్నా" అంది.

"నాన్నా! క్లర్క్ అంటే నువ్వు చేసే గుమస్తా వుద్యోగమేగా ?" ప్రశ్నించాడు రాంబాబు.

"ఔను" అన్నాడు కృష్ణమూర్తి.

"నేను గుమస్తాను కాను నాన్నా" చెప్పాడు రాంబాబు.

కృష్ణమూర్తి నవ్వాడు.

"మరి ఏమవుతావురా?" అన్నాడు.

"ఇంజనీర్ని అవుతా!" అన్నాడు రాంబాబు

"ఇంజనీర్ కావాలంటే మార్కులు బాగా రావాలి. బాగా చదివి డిస్టింక్షన్ తెచ్చుకోవాలి" చెప్పాడు కృష్ణమూర్తి.

కాని నువ్వు డిస్టింక్షన్ తెచ్చుకున్నా ఇంజనీరింగ్ చదివించే ఆర్థిక స్తోమత లేనివాడిని బాబూ" అని చెప్పలేకపోయాడు.

పదిహేను సంవత్సరాలు నిండిన రాంబాబుకి ఇప్పుడిప్పుడే లోకం గురించి తెలుస్తోంది.

చిన్నప్పటినుంచి రాంబాబు కోరికలు ఏవీ తండ్రి తీర్చలేకపోయాడు కోరికలు చంపుకుని బతకడం అలవాటైపోయింది వాడికి.

ఆరేళ్ళ వయసున్నప్పుడు మూడుచక్రాల సైకిల్ అంటే ఎంతో మోజుగా వుండేది రాంబాబుకి. పక్కింట్లో హెడ్‌కానిస్టేబుల్ మనవడు

తొక్కుతుంటే ఆశగా చూసేవాడు తనకూ అటువంటిది కావాలని తండ్రిని అడిగాడు. "సరేలే" "అలాగే" అని చెప్పేవాడు ఎప్పుడూ. తల్లిని పోరు పెట్టేవాడు కొనమని. ఆమెకు కోపమువచ్చి కొట్టేది. ఆ తర్వాత పశ్చాత్తాప పడేది. ఎత్తుకునేది. గుండెలకు హత్తుకుని కన్నీళ్ళు పెట్టుకునేది.

ఆ తర్వాత చాలాసార్లు ఇంట్లో అన్నం వండని రోజులు గూడా రాంబాబుకి గుర్తున్నాయి. తాత కుక్కిమంచంలో దగ్గుతూ పడుకునేవాడు.

"ఈ ముసలాయన ఎప్పుడు పోతాడో చస్తున్నాం చాకిరీ చెయ్యలేక. ఎక్కడెక్కడో అప్పులుతెచ్చి డాక్టర్లకి, మందులకి పోస్తున్నాం" అని రాంబాబు తల్లి విసుక్కుంటుండేది

తాతయ్య చచ్చిపోవడం, తల్లి మెడలో వున్న గొలుసు అమ్మడం, అప్పుడు అమ్మా నాన్నా పోట్లాడుకోవడం అన్నీ రాంబాబుకి గుర్తున్నాయి.

పండగలొచ్చినా కొత్త బట్టలు కుట్టించే వాడు కాదు తండ్రి. ఎప్పుడో సంవత్సరాని కొకసారి ఫలానా కంపెనీ వాళ్ళు అప్పు ఇస్తున్నారని తెచ్చే వాడు. అవి రాంబాబుకి నచ్చేవి కాదు. అయినా తప్పేది కాదు.

ఎదురింట్లో వున్న ఇంజనీర్ అంకుల్ ఇంటికి వెళ్తే రాంబాబుకి కళ్ళు చెదిరి పోయేవి వాళ్ళింట్లో అన్ని వస్తువులున్నాయి రాంబాబు ఇంట్లో ఏమీలేవు.

రాంబాబు గట్టిగా నిశ్చయించుకున్నాడు తను తండ్రిలా గుమస్తా కాకూడదు. ఇంజనీర్ అవ్వాలి అందుకని బాగా చదువు కోవాలి.

అప్పట్నుంచి రాంబాబు శ్రద్ధగా చదువుకో సాగాడు.

పదో క్లాసు ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

"ఇంజనీర్ కావాలంటే ఏ గ్రూప్ తీసుకోవాలని" మాష్టార్ని అడిగి తెలుసుకున్నాడు.

ఎమ్. పి. సి. గ్రూప్ తీసుకుని జూనియర్ కాలేజీలో చేరాడు రాంబాబు.

"కాలేజీలో సరిగా చెప్పడం లేదు నాన్నా! ట్యూషన్‌కి వెళ్తాను." అని తండ్రిని అడిగాడు రాంబాబు.

కృష్ణమూర్తి "సరే" అన్నాడు. ట్యూషన్ ఫీజు సబ్జెక్టుకి ఐదొందలు గ్రూప్‌కి, ఇంగ్లీషుకి కలిసి రెండువేలు కట్టాలని చెప్పినప్పుడు కృష్ణమూర్తి కుంగిపోయాడు ఒక్కసారే రెండువేలు ఎవరిస్తారు? ఇదుగో, అదుగో అని రోజులు దొర్లిపోతున్నాయి· తనకి తండ్రి ట్యూషన్ చెప్పించలేడని రాంబాబు అర్థం చేసుకున్నాడు మళ్ళీ అడగలేదు. ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళి నోట్స్ రాసుకుని వాళ్ళతో తెలియనివి అడిగి చెప్పించుకుని చదువుకున్నాడు.

ఇంటర్ రెండో సంవత్సరం ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయ్యాడు రాంబాబు· ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌కి రాశాడు ఇంజనీరింగ్ కాలేజీలో సీటొచ్చింది· అయినా కోర్సు పూర్తయ్యేటప్పటికి కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతాయని తెలిసి కృష్ణమూర్తి నిస్సహాయంగా క్రుంగి పోయాడు

రాంబాబుకి ఇంజనీరింగ్‌లో సీటొచ్చిందని తెలిసి దూరపు చుట్టము ఒకాయన వాడిచదువు ఖర్చు భరి చడానికి ముందుకొచ్చాడు· అయితేతర్వాత రాంబాబు ఆయన కూతుర్ని పెళ్ళిచేసుకోవాలని కండిషన్· తన కొడుకు భవిష్యత్తుఅయినా సుఖంగా వుంటుందని భావించి అందుకు కృష్ణమూర్తి అంగీకరించాడు·

రాంబాబు ఇక కాలేజీలో చేరడమే తరువాయి.

కృష్ణమూర్తికి గుండెపోటొచ్చి ఆఫీసు కుర్చీలోనే కళ్లు మూశాడు· రాంబాబు పేకమేడలు కూలిపోయాయి

అక్క పెళ్ళి, తల్లిపోషణ, తమ్ముళ్ళ బాధ్యత ఒక్కుమ్మడిగా రాంబాబుమీద పడ్డాయి.

అప్పటికి రాంబాబుకి పదిహేడు సంవత్సరాలు నిండాయి· మరొక సంవత్సరము ఆగి రాంబాబుకి తండ్రి పనిచేసిన ఆఫీసులోనే గుమస్తా వుద్యోగం ఇచ్చారు

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
1988, ప్రత్యేక సంచిక, దీపావళి.

...o...